క్లుప్తంగా

ఇన్‌చార్జ్ ఎంపీడీఓకు పదోన్నతి



దాసనాయక్

హొళగుంద: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పరిపాలనధికారి (ఏఓ)గా బాధ్యతలు చేపట్టి ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న దాసనాయక్ ఎంపీడీఓగా పదోన్నతి పొందారు. గతంలో ఎంపీడీఓగా పని చేసిన మేరి కొత్తపల్లికి బదిలీ కావడంతో ఈ స్థానం ఖాళీగా ఉండేది. దీంతో దాసనాయక్ ఇన్‌చార్జ్‌గా కొనసాగారు. ఇటవలే రాష్ట్ర ప్రభుత్వం బదిలీలు, పదోన్నతులు చేపట్టడంతో దాసనాయక్‌కు ఎంపీడీఓగా ప్రమోషన్ కల్పించి అనంతపురం జిల్లాకు బదిలీ చేశారు. త్వరలో ఆయన అక్కడ బాధ్యతలు చేపట్టనున్నారు. డి.హిరెహాళ్ మండలం ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టే అవకాశాలున్నాయి.

దోమకాటుకు తెరతో అడ్డుకట్ట



దోమల నివారణపై అవగాహన కల్పిస్తున్న జిల్లా మలేరియా అధికారి నూకరాజు

మద్దికెర: దోమకాటు వల్ల డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వచ్చే ప్రమాదముందని, రాత్రి నిద్రించే సమయంలో దోమతెరలు వాడి దోమకాటుకు గురికాకుండా రక్షణ పొందాలని జిల్లా మలేరియా అధికారి నూకరాజు సూచించారు. గురువారం జాతీయ కీటక జనిత వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మద్దికెరలోని ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మండల పరిధిలోని బొమ్మనపల్లి గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి డీడీటీ మందులు పిచికారీ చేయించడమే గాకుండా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి ఖాళీ టైర్లు, కుండీలు, తొట్టెలు, డ్రమ్ముల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించి శుభ్రం చేయాలన్నారు. ఇళ్లలో వేపాకు పొగ వేసుకోవడం వల్ల దోమల వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. సర్పంచ్ ఆంజనేయులు, వైద్యులు నగేష్, సీహెచ్ఓ నిరంజన్, సిబ్బంది వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ, ప్రకాష్, రాజేంద్ర, ఏఎన్ఎం నాగమణి తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు



గాయపడిన వ్యక్తికి సీపీఆర్ చేస్తున్న దృశ్యం

ఆస్పరి: ఆస్పరి సమీపంలో గురువారం స్కూటర్‌ను లారీ ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైనట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు మండలంలోని శంకరబండ గ్రామానికి చెందిన హనుమంతు పని నిమిత్తం ఆస్పరికి వచ్చారు. పని ముగించుకుని స్వగ్రామమైన శంకరబండకు స్కూటర్‌పై వెళ్తుండగా ఆదోని నుంచి ఆస్పరి వైపు వస్తున్న లారీ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదంలో ఒక కాలు తెగిపడింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు స్థానికుల సహాయంతో ఆటోలో చికిత్స నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడినుంచి మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలుకు తీసుకెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

హొళగుంద: గజ్జహళ్లి గ్రామానికి చెందిన చాకలి మారెప్పకు చెందిన పాడి గేదె గురువారం వందవాగిలి రస్తా పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్‌కు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. గేదె మృతి చెందడంతో రూ.70 వేలు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. గురువారం వీచిన ఈదురుగాలులకు ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్‌వైర్‌కు విద్యుత్ సరఫరా జరిగి ఉంటుందని గ్రామస్తులు అభిప్రాయం వ్యక్తం చేశారు. మేత మేసేందుకు వెళ్లిన గేదె ఎర్త్ వైర్‌కు తగిలి విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందిందన్నారు. పరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

గజ్జహళ్లి సర్పంచ్ ఔదార్యం

హొళగుంద: గజ్జహళ్లి గ్రామానికి చెందిన చాల రంగప్ప అనే యువకుడి వివాహానికి గురువారం గ్రా మ సర్పంచ్ ఆరుబట్ల నాగమ్మ తాళిబొట్టు, కాలి మెట్టలను అందించి ఔదార్యాన్ని చాటుకున్నారు. సాంప్రదాయం ప్రకారం వివాహ కార్యక్రమంలో వరుడి తరఫువారు తాళి బొట్టు, మెట్టెలు ఇవ్వాల్సి ఉంటుంది.నిరుపేదలైన రంగప్పకు సర్పంచ్ వాటిని కానుకగా అందించడంతో కతృజ్ఞతలు తెలిపాడు.

గడ్డివామి దగ్ధం

ఆలూరు రూరల్/హాలహర్వి: ప్రమాదవశాత్తు నిప్పంటుకుని గడ్డివాము దగ్ధమైంది. వివరాలు.. హాలహర్వి మండలం పచ్చాపల్లికి చెందిన రైతు షేక్ ఆలం బాషా ఇటీవలే రూ.65 వేలు వెచ్చించి ఎద్దుల కోసం జొన్నసొప్ప కొనుగోలు చేశాడు. గురువారం తెల్లవారుజామున గడ్డివాముకు నిప్పంటుకోవడంతో ఫైర్ అధికారులకు సమాచారం అందించారు. ఫైర్ అధికారులు వచ్చి మంటలు అదుపుచేసేలోపు గడ్డివాము పూర్తిగా కాలిపోయింది.

జగనన్న సహకారం మరువలేం

- వైఎస్సార్‌సీపీ హయాంలోనే నియోజకవర్గ అభివృద్ధి
- వెనుకబడిన ప్రాంతం అభివృద్ధికి సీఎం జగనన్న ఎంతో చేశారు
- పత్తికొండకు టీడీపీ చేసింది శూన్యం
- రైతు భరోసా సభలో ఎమ్మెల్యే శ్రీదేవి

పత్తికొండ టౌన్: జిల్లాలో వెనుకబడిన ప్రాంతమైన పత్తికొండ నియోజకవర్గ అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందించిన సహకారం మరువలేమని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. గురువారం పత్తికొండలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్న రైతు భరోసా సభలో ఎమ్మెల్యే ఉద్వేగభరితంగా మాట్లాడారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల పత్తికొండ అభివృద్ధి చెందలేదని, డిప్యూటీ సీఎం హోదాలో పనిచేసిన కేఈ కృష్ణమూర్తి నియోజకవర్గ అభివృద్ధికి చేసింది శూన్యం అన్నారు. వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో రెండేళ్లకు పైగా కరోనా ఇబ్బందులతో రాష్ట్ర ఆదాయం పడిపోయినా ప్రజలకు ఇచ్చిన హామీలను 98 శాతం నెరవేర్చడంతో పాటు, నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి జరిగిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో వెల్దుర్తిలో 15 రోజులకోసారి తాగునీరు వచ్చేదని, సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.3.10 కోట్లతో తాగునీటి పథకాలు మంజూరు చేయడంతో ప్రజల దాహార్తి తీరిందని వివరించారు. వెల్దుర్తి పీహెచ్‌సీని రూ.6 కోట్లతో అప్‌గ్రేడ్ చేశారని చెప్పారు. తుగ్గలి, మద్దికెర మండలాల్లోని 14 చెరువులను రూ.36 కోట్లతో అభివృద్ధి చేసినట్లు వివరించారు. హంద్రీ–నీవా మెయిన్ కాలువ నుంచి 68 చెరువులకు రూ.300 కోట్లతో నీటిని నింపే కార్యక్రమాన్ని చేపట్టారని, వాటిలో పత్తికొండ నియోజకవర్గంలో 35 చెరువులు ఉన్నాయని, పనులు 95 శాతం పూర్తయినట్లు తెలిపారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

హోసూరు–మొలగవెల్లి రహదారిలో రైతులు పొలాలకు వెళ్లేందుకు సరైన మార్గం లేక పంట ఉత్పత్తులను గాడిదలపై తరలించేవారని, రోడ్డు నిర్మాణానికి రూ.7.20 కోట్లు మంజూరు చేయడంతో వేగవంతంగా జరుగుతున్నాయని చెప్పారు. అలాగే ఎస్‌హెచ్ ఎర్రగుడి– గోరంట్ల బ్రిడ్జి కోసం రూ..22 కోట్లు విడుదల చేశారన్నారు. పత్తికొండలో రూ.30 కోట్లతో రోడ్ల విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని వివరించారు. పత్తికొండకు రెవెన్యూ డివిజన్, పోలీసు సబ్‌డివిజన్, వెల్దుర్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు, వెల్దుర్తి పోలీసు సర్కిల్ కార్యాలయం మంజూరు చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు. హంద్రీ–నీవాపై లిఫ్ట్ ఏర్పాటుచేస్తే 6 వేల ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు వలసలు నివారించవచ్చని, అందుకు రూ.80 కోట్లు మంజూరు చేయాలని సీఎంను కోరారు. టమాట రైతులను ఆదుకునేందుకు ప్రాసెసింగ్ యూనిట్, పత్తికొండకు బీసీ బాలికల హాస్టల్ మంజూరు చేయాలని విన్నవించారు. బొందిమడుగుల, కోయిలకొండ బ్రిడ్జిల నిర్మాణానికి రూ.కోటి విడుదల చేయాలని, జొన్నగిరిలో పేదలకు పట్టాలు ఇచ్చేందుకు భూమిని కొనుగోలు చేయాలని, టి.గోకులపాడు హంద్రీ–నీవాపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.7 కోట్లు విడుదల చేయాలని కోరారు.



దారిపొడవునా తండోపతండాలుగా తరలివస్తున్న జనం

జననేతకు జనహారతి

పత్తికొండ రూరల్: జన హృదయ నేతకు జనహారతి లభించింది. గురువారం పత్తికొండలో వైఎస్సార్ రైతు భరోసా కార్యక్రమం ప్రారంభానికి వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఆత్మీయ స్వాగతం పలికేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు మహానేత దివంగత వైఎస్సార్, సీఎం జగన్ ఫొటోలతో స్వాగత తోరణాలు, ఫ్లెక్సీలు, భారీ కటౌట్‌లు ఏర్పాటు చేశారు. సభ ప్రారంభానికి ముందు ఎటుచూసినా జనమే. ఊరికి పండుగొచ్చిందన్నట్లుగా జన సందడి కనిపించింది. 'మా నమ్మకం నువ్వే జగనన్నా' అంటూ పెద్ద ఎత్తున ప్రజలు నీరాజనం పలికారు. జగనన్న వస్తున్నాడని తెలుసుకుని మండుటెండను సైతం లెక్కచేయకుండా చిన్నాపెద్ద తేడా లేకుండా అడుగులన్నీ సభ ప్రాంగణం వైపే పడ్డాయి. సభాస్థలి నిండిపోయి ప్రాంగణం మొత్తం జనసంద్రమైంది. గ్రామాల నుంచి రైతులు తండోపతండాలుగా తరలిరాగా అశేష ప్రజానీకం మధ్యన జననేత ప్రసంగం కొనసాగింది.



సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కటౌట్ల వద్ద అభిమానుల సందడి



'మా నమ్మకం నువ్వే జగనన్న' ప్లకార్డులను ప్రదర్శిస్తున్న అభిమానులు



సభా ప్రాంగణానికి చేరుకుంటున్న సీఎం వైఎస్ జగన్‌ను చూసేందుకు వేచిఉన్న జనం



మిద్దెలెక్కిన అభిమానం

సీఎంకు ఘన స్వాగతం

ఎమ్మిగనూరుటౌన్: పత్తికొండలో రైతు భరోసా కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు జిల్లాకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గురువారం ఓర్వకల్ ఎయిర్ పోర్టులో ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్ మోహన్‌రెడ్డి కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. సీఎం వారిని ఆప్యాయంగా పలకరించారు.



ఓర్వకల్లు ఎయిర్‌పోర్టులో సీఎం వైఎస్ జగన్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, ఎర్రకోట జగన్

ఎల్లార్తి దర్గాల నిర్వహణకు టెండర్

– రూ.2.50 కోట్లకు దక్కించుకున్న ఎల్లార్తి వాసి

హొళగుంద: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఎల్లార్తి షేక్షావలి, షాషావలి దర్గాల నిర్వహణ కోసం గురువారం విజయవాడ స్టేట్ వక్ఫ్ బోర్డు కార్యాలయంలో సీల్డ్ టెండర్లను ఓపెన్ చేయగా రూ.2.50 కోట్లకు దక్కించుకున్నట్లు ఎల్లార్తి గ్రామానికి చెందిన బోయ లక్ష్మికాంత్ గురువారం తెలిపారు. రెండు దర్గాలు, 38 రూములు, చందాపట్టి, చర్మ సేకరణ, చక్కెర, హెయిర్ కటింగ్ తదితర వాటికి ఏడాది నిర్వహణకుగాను సీల్డ్ టెండరును మే 27 నుంచి ఈ నెల 1వ తేదీ వరకు ఆహ్వానించారు. ఆంధ్ర, తెలంగాణ నుంచి మొత్తం 7 సీల్డ్ టెండర్లు దాఖలు కాగా వాటిని గురువారం టెండర్ గడువు ముగిసిన తర్వాత విజయవాడలో ఓపెన్ చేశారు. అత్యధికంగా కోట్ చేసిన లక్ష్మికాంత్ నిర్వహణ హక్కులను దక్కించుకున్నారు. వక్ఫ్‌బోర్డు అధికారులు నిర్వహణ గడువును తెలిపి దర్గాలను స్వాధీనం చేసిన తర్వాత తాము బాధ్యతలు తీసుకుంటామని లక్ష్మికాంత్ తెలిపారు.



ఎల్లార్తి దర్గా ముఖం

ఈదురుగాలుల బీభత్సం



హొళగుందలో చెరువును తలపిస్తున్న తేరు బజారు

హొళగుంద: మండలంలో గురువారం మధ్యాహ్నం కుండపోత వర్షానికి ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలులు తోడుకావడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. హొళగుంద–ఢణాపురం 33 కేవీ విద్యుత్ లైన్‌లో కొన్ని గంటలు పాటు సరఫరా నిలిచిపోయింది. రాత్రి 7 గంటలకు విద్యుత్ సౌకర్యం పునరుద్ధరించారు. దాదాపు రెండు గంటల పాటు వర్షం కురిసింది. హొళగుందతో పాటు పలు గ్రామాలలో వీధులు జలమయమయ్యాయి. హొళగుందలోని తేరు బజారు, ప్రధాన రోడ్డుతో పాటు సిద్ధేశ్వర మోడ్రన్ రైస్ మిల్ పరిసరాల్లో పెద్ద ఎత్తున నీరు నిలిచి చెరువును తలపించింది. ఈదురుగాలులకు మార్లమడికి వద్ద బళ్లారి రోడ్డుపై, కోగిలతోట, హొళగుంద తదితర గ్రామాలలో విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. దీంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. కోగిలతోటలో భారీ చెట్టు నేలకూలింది. గాలికి రేకుల షెడ్డులు ధ్వసంమయ్యాయి. ఆదోని రోడ్డులో హొళగుంద పెద్ద చెరువుకు వెళ్లే వంక పొంగి ప్రవహించింది. వంక కల్వర్టుకు అడ్డుపడిన ముళ్ల కంపలు, చెత్తను పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్, నాయకుడు పంపాపతి పొక్రెయిన్‌తో తొలగించి నీటి ప్రవాహం సజావుగా సాగేలా చర్యలు తీసుకున్నారు.

ఆలూరు రూరల్: ఆలూరులో గురువారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈదురుగాలులకు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ తీగలు తెగిపోవడంతో సరఫరా నిలిచిపోయింది. తుంబళబీడు గ్రామంలో రెండు స్తంభాలు, కర్నూలు–బళ్లారి రహదారిలో మూడు స్తంభాలు విరిగిపడ్డాయి. వివిధ కాలనీల్లో చెట్లు విరిగి తీగలపై పడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది



హొళగుంద పెద్ద చెరువుకు వెళ్లే వంక కల్వర్టుకు అడ్డుపడిన ముళ్ల కంపలు, చెత్తను పొక్లెయిన్‌తో తొలగిస్తున్న దృశ్యం



మార్లమడికిలో బళ్లారి రోడ్డుపై పడిపోయిన విద్యుత్ స్తంభాలు

అన్నదాతకు పెట్టుబడి సాయం

కృష్ణగిరి:వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద గురువారం అన్నదాతల ఖాతాలకు పెట్టుబడి సాయం జమ అయ్యింది. పత్తికొండలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలవ్యాప్తంగా 14,051 కుటుంబాలకు ఒక్కొక్కరి ఖాతాలో రూ.5,500 ప్రకారం మొత్తం రూ.7,72,80,500 వారి ఖాతాల్లో జమ అవుతున్నాయన్నారు. అలాగే పీఎం కిసాన్ నిధులు రూ.2000 చొప్పున జమవుతాయని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం ఆపత్కాలంలో అన్నదాలకు అండగా నిలిచిన సీఎంకు అందరూ రుణపడి ఉండాలని మండల వ్యవసాయ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. అలాగే ఖరీఫ్‌కు సంబంధించి విత్తనాలు అన్ని ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉన్నాయని రైతులు సబ్సిడీ పోనూ తమ వాటా సొమ్ము చెల్లించి విత్తనాలు పొందవచ్చని ఆయన తెలిపారు.

రూ.53 లక్షలతో రోడ్డు నిర్మాణం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని హెచ్‌బీఎస్ కాలనీలో ఎల్ఐసీ కార్యాలయం వైపు రూ.53 లక్షలతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణంతో కాలనీ వాసుల సమస్యలు తీరనున్నాయని వైఎస్సార్‌సీపీ 21వ వార్డు ఇన్‌చార్జ్ మురహరి రాజశేఖర్, టౌన్‌బ్యాంక్ డైరెక్టర్ సయ్యద్‌చాంద్ పేర్కొన్నారు. గురువారం రోడ్డు నిర్మాణ పనులను వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని మున్సిపల్ నిధులు మంజూరు చేయించడంతో రోడ్డు నిర్మాణం జరుగుతోందన్నారు. రోడ్డు నిర్మాణంపై వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ



నందవరం: మండల పరిధిలోని కనకవీడు పేట గ్రా మంలో వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. గురువారం గ్రామంలో వాల్మీకి పెద్దలు, వేద పండిత శ్రీకృష్ణ స్వామి నేతృత్వంలో విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించారు. ముందుగా మహర్షి విగ్రహాన్ని పుర వీధుల్లో ఊరేగించారు. అనంతరం రామప్ప దేవాలయం వద్ద విగ్రహ ప్రతిష్ఠాపన చేపట్టారు. ముఖ్యఅతిథులు వీజీఆర్ కొండయ్య, యాపిలయ్య హాజరై మాట్లాడుతూ.. వాల్మీకి సోదరులు ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలన్నారు. ఎస్టీ సాధన కోసం ప్రతి ఒక్కరూ ఉద్యమించాలన్నారు. వాల్మీకులు సా మాజికంగా, ఆర్థిక ంగా, రాజకీయంగా ఎదగాలన్నా రు. తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించి, నేటి సమాజంలో మంచి గుర్తింపు పొందాలని పిలుపునిచ్చారు.వాల్మీకి నాయకులు కృష్ణతేజ నాయుడు, ఈర న్న, రంగన్న, మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పండుగ

నందవరం: మండలంలో పింఛన్ల పండుగ ప్రారంభమైంది. వలంటీర్లకు 31వ తేదీనే అధికారులు పింఛన్ సొమ్ము అందించడంతో గురువారం తెల్లవారుజాము నుంచే లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో 6,963 మంది పింఛన్‌దారులకుగానూ మొదటి రోజు 4,601 మందికి (66 శాతం) పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. మిగిలిన వారికి రెండు రోజుల్లో పంపిణీ చేసి వంద శాతం పూర్తి చేస్తామని వెల్లడించారు.

నేటి నుంచి పది సప్లిమెంటరీ పరీక్షలు

గోనెగండ్ల: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమవుతున్నట్లు ఎగ్జామినర్ చీఫ్ నాగభూషణం తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. పరీక్షా సమయం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12:45 వరకు ఉంటుందన్నారు. మండలంలోని వివిధ పాఠశాలల నుంచి 143 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఆయన తెలిపారు. వీరికోసం గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విద్యార్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. విద్యార్థులకు మంచినీరు, వైద్య సేవలతో పాటు డెస్కులు ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు.

సప్లిమెంటరీ పరీక్షలకు మూడు కేంద్రాలు

ఆలూరు రూరల్: నేటి (శుక్రవారం) నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 650 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరికోసం ఆలూరులోని ప్రభుత్వ బాలుర పాఠశాల–1, ప్రభుత్వ పాఠశాల–2, మోడల్ స్కూల్‌లో సెంటర్లను ఏర్పాటు చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి కోమలాదేవి తెలిపారు. ఎలాంటి మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పరీక్ష కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ నెల 10వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. పరీక్షలు రాసే విద్యార్థుల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

ఆటో బోల్తా పడి డ్రైవర్ దుర్మరణం

ఆలూరు: దేవనకొండ మండల కేంద్రం నుంచి జిల్లెడుబుడక గ్రామానికి ప్రయాణిస్తున్న ఆటో బోల్తా పడి డ్రైవర్ ఏకాంతేశ్వర్ (32) అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే జిల్లెడుబుడక గ్రామం నుంచి మిత్రుడు నరసింహ నాయుడును హైదరాబాద్ బస్సు ఎక్కించేందుకు మరొక మిత్రుడు వీరేష్ నాయుడుతో కలిసి అశోక్ లేలాండ్ గూడ్స్ ఆటో ఏపీ 39 బి 6415లో దేవనకొండకు బయలుదేరారు. వీరేష్ నాయుడు బస్సు ఎక్కిన తర్వాత జిల్లెడుబుడకలకు తిరుగు ప్రయాణంలో గద్దెరాళ్ల స్టేజ్ వద్ద అకస్మాత్తుగా కుక్క అడ్డం రావడంతో తప్పించబోయి కుడి వైపుకు తిప్పగా ఆటో బోల్తా పడింది. డ్రైవర్ ఏకాంతేశ్వర్ తలకు బలమైన గాయం తగలడంతో రక్తస్రావం జరిగి అక్కడికక్కడే మృతిచెందాడు.

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి

పత్తికొండటౌన్: ఏళ్ల తరబడి విద్యుత్ శాఖలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయా లని ఎంప్లాయీస్ యూనియన్ (1104) నాయ కులు కృష్ణయ్య, బీఎస్ గణేశ్, మధుకుమార్, వైఎస్సార్ విద్యుత్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు రామకృష్ణ, ప్రేమ్‌కుమార్ విజ్ఞప్తి చేశా రు. గురువారం పత్తికొండ పర్యటనకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని యూనియన్ నాయకులు హెలిప్యాడ్ వద్ద కలిసి వినతిపత్రం అందజేసి సమస్యలు విన్నవించారు. వారి సమస్యలను సానుకూలంగా విన్న సీఎం వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ప్రత్యేక కార్యదర్శి ధనుంజయరెడ్డికి ఆదేశాలు ఇచ్చినట్లు యూనియన్ నాయకులు తెలిపారు. ఇందుకు సీఎంకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

– నియోజకవర్గ కేంద్రమైన పత్తికొండ రెవెన్యూ డివిజన్ అయినందున సీనియర్ సివిల్ జడ్జి (సబ్ కోర్టు) ఏర్పాటు చేయాలని బార్ అసోసియేషన్ తరఫున సీనియర్ న్యాయవాది ఎల్లారెడ్డి సీఎంను కలసి వినతి పత్రం అందజేశారు. పరిశీలిస్తామని సీఎం హామీ ఇచ్చారు.